ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 17 అక్టోబరు 2025 | 5





రేపే గృహప్రవేశాలకు

రాజాధిరాజా..

రాజాధిరాజ అలంకరణలో

గజవాహనంపై శ్రీవారి విహారం

ఘనంగా లక్షతులసీ పూజా మహోత్సవం

స్వామివారికి తిరుప్పావడ సేవ..

బ్రహ్మోత్సవాల్లో వైభవంగా ఏడో రోజు

6



ముహూర్తం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు సొంతింటి కల సాకారం చేసేందుకు పూర్తయిన ఇళ్లకు గృహప్రవేశాలు చేయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోంది. 2024, జూన్‌నుంచి ఇప్పటివరకు జిల్లాలో పూర్తయిన 7022 ఇళ్లకు ఈనెల 18వ తేదీనాటికి గృహ ప్రవేశాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్లకు ఆర్థిక స్థోమత సరిపోక, ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము చాలక జగనన్న కాలనీల పేరుతో మొదలైన ఇళ్లు మధ్యలో నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకుందామని ఆశతో ప్రారంభించి ఇళ్లు కట్టుకోలేక మధ్యలోనేఆపేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించింది. గతేడాది డిసెంబరు 10నాటికి నిర్మాణ దశలో ఉన్న ఎస్సీ, బీసీల ఇళ్లకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రోత్సాహంగా అందించడంతో అర్ధాంతరంగా ఆగిపోయిన పేదల ఇళ్లుసహా, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద నిర్మించుకుంటున్న ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 7,022మంది పేదలు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యారు.

- జిల్లాలో 7022 ఇళ్లు సిద్ధం
- హౌసింగ్ ఈఈ శ్రీనివాస్

నియోజకవర్గాల వారీగా ఇళ్లు సిద్ధం



కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో 1321, కాకినాడ రూరల్‌లో 618, పిఠాపురంలో 773, జగ్గంపేటలో 660, పెద్దాపురంలో 889, ప్రత్తిపాడులో 982, తునిలో 962, రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరులో 212, అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో 268. మొత్తం 7022 ఇళ్లకు గృహప్రవేశం చేయనున్నారు. ప్రభుత్వం ప్రతిఒక్కరికీ గూడుకల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఆదుకునేందుకు ప్రత్యేక అదనపు సాయంఅందిస్తుంది. ఇది నిజంగా పేదలకు వరం. ఈ అదనపు ఆర్థిక సాయం తో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి.

-వై.శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ, కాకినాడ

'తెలుగు' వెలుగు



మునిరత్నంనాయుడు

బొమ్మూరులోని విశ్వవిద్యాలయ పీఠం

- బొమ్మూరులో ఎట్టకేలకు పూర్తిస్థాయి తెలుగు విశ్వవిద్యాలయం
- ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు
- వర్సిటీ అభివృద్ధికి నిధుల విడుదలకూ ప్రతిపాదనలు
- 1986 ఏప్రిల్‌లో తెలుగు సాహిత్య పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- రాష్ట్ర విభజన తర్వాత తొలిగా విశ్వవిద్యాలయం ఏర్పాటు
- తెలుగుభాషకు, సాహిత్యానికి ఇక పూర్వవైభవం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఇది ఎన్నో ఏళ్ల నాటి కల.. ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చింది. రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటివరకు బొమ్మూరులో తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇది పూర్తిస్థాయి యూనివర్సిటీగా మారుతుందని అందరూ ఆశించారు. అందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకున్నది లేదు. ఎట్టకేలకు గత జూన్ నెలలో ఈ పీఠాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ప్రాచీన తెలుగు కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.మునిరత్నంనాయుడుని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ విశ్వవిద్యాలయంలో కదలిక వచ్చినట్టయింది. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత రిజిస్ట్రార్‌ను నియమిస్తారు. తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలన మొదలవుతుంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఉండేది. దానికి అనుబంధంగా మన రాష్ట్రంలో రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలు ఏర్పాటయ్యాయి. గత ఏడాది జూన్ నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తికావడం, విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంతో అనుబంధ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాన్ని కేబినెట్ ఆమోదించినా వీసీ లేకపోవడంతో 2024-25 అడ్మిషన్లు జరగలేదు. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు మొదలుపెట్టాలి. మరి ఈ విద్యా సంవత్సరాన్ని ఎలా మొదలెడతారో చూడాలి.

● రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఏపీ రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు ఏపీలోని విశ్వవిద్యాలయానికి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానం అయింది. బొమ్మూరులోని తెలుగు పీఠంలో గత ఏడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. జూలై 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి ఇక ఈ పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇటువంటి పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగువిశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఈ పీఠానికే కాకుండా రాష్ట్ర ప్రజలకే ఓ తీయని శుభవార్తను అందించినట్టు అయింది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం మొలకెత్తింది. ఆదికవి నన్నయ్య భారతాన్ని తెలుగులోకి అనువదించిన నేల రాజమహేంద్రవరం. తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతమిది. ఇక్కడ 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగు భాషను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగువిశ్వవిద్యాలయానికి అనుబంధంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటుచేశారు. తర్వాత బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది.

● తెలుగుసాహిత్య పీఠం నుంచి...

రాజమండ్రిలోని బొమ్మూరు కొండ మీద సుమారు 45 ఎకరాల భూమిలో తెలుగు సాహిత్య పీఠం ఉండగా, అదిప్పుడు తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. 1986లో ఈ పీఠానికి మొత్తం 45 ఎకరాల స్థలాన్ని అధికారికంగా ఇవ్వడంతోపాటు సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని కూడా దఖలు పరిచారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, దానిలో తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ కూడా నిర్మించారు. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియమితులయ్యారు. తర్వాత వరసగా బేతవోలు రామబ్రహ్మం, ఆర్వీఎస్ సుందరం, సి.రమణయ్య, బేతవోలు రామబ్రహ్మం, సి.రమణ్య, పొన్నా లీలావతి, ఎండ్లూరి సుధాకర్, గొల్లకోట సూర్య భాస్కరావు, చివరగా మళ్లీ ఎండ్లూరి సుధాకర్ ఇక్కడ పీఠాధిపతులుగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య సభలకు, మరెన్నో గోష్ఠులకు ఈ కేంద్రం విలసిల్లింది. ఇక్కడ తెలుగు ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు తొలి ఎంఫిల్ బ్యాచ్ పట్టా పొందారు. ప్రముఖకవి అద్దేపల్లి రామోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. ఇక్కడ 300 మంది పీ హెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. 550 మంది తెలుగు ఎంఏ చేశారు.

● ప్రస్తుత పరిస్థితి

ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. అందులో కొందరు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. భవనాలు దాదాపు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ ముఖ్యంగా 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతనంగా ఉండడం విశేషం. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బొమ్మూరు కొండపై ఉన్న భవనాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రారంభ బడ్జెట్ కింద రూ.20 కోట్లు, జీతభత్యాలు-మౌలిక సదుపాయాల కింద మరో రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. హైదరాబాద్ తెలుగువిశ్వవిద్యాలయంలో మొత్తం 22 విభాగాలు, 40 కోర్సులు ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతానికి డిమాండు ఉన్న కోర్సులను ప్రారంభించే అవకాశం మాత్రమే ఉంది. ఇది ఇక తెలుగుభాషా సాహిత్యం, సంస్కృతిలో ఉన్నత స్థాయి అధ్యయనం, బోధన, పరిశోధనా కేంద్రంగా పనిచేయనుంది.

మరో అడుగు

- పోలవరం నిర్వాసితులకు రూ.1,100 కోట్లు పరిహారం

దేవీపట్నం/కుక్కునూరు/వేలేరుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న నిర్వాసితులకు పునరావాస, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం ప్యాకేజీని వారి ఖాతాల్లో జమచేయడానికి ప్రభుత్వం రూ.1,100కోట్లు విడుదల చేసింది. దీనిపై దేవీపట్నం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది జనవరిలో దేవీపట్నం మండలంలోని పలు గ్రామాల నిర్వాసితులకు, కుక్కునూరు ఏ-బ్లాక్, గొమ్ముగూడెం, సీతారామపురం, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, భువనగిరి, గుంపెనపల్లి గ్రామాల్లోని నిర్వాసితులకు, వేలేరుపాడు మండలాల నిర్వాసితులకు రూ.1,000కోట్ల వరకు వారి ఖాతాల్లో జమచేశారు. నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాసం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం, పునరావాస కాలనీల్లో ఇళ్లు, స్థలం వద్దనుకున్న వారికి పరిహారం చెల్లించారు. తాజాగా దేవీపట్నం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25గ్రామాల్లోని నిర్వాసితుల ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది. 41.15 కాంటూరు పరిధిలో రూ.2,500 కోట్లు నిర్వాసితులకు చెల్లించాల్సి ఉండగా జనవరిలో కొంత మేర నిధులు విడుదల చేయడంతో వేలేరుపాడు మండలంలో అక్కడక్కడ సొమ్ములు జమయ్యాయి. గతంలో పెండింగులో వున్న బిల్లులతోపాటు కొత్తగా పెట్టబోయే బిల్లులను ప్రభుత్వానికి పంపిస్తే ఆ మేరకు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమయ్యే అవకాశాలున్నాయి.

ఏపీ ఎక్సైజ్..
సురక్ష యాప్

- కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు విడుదల చేసిన ప్రభుత్వం
- డౌన్‌లోడ్ చేసుకోవాలంటున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ

కాకినాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎంకే కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, రెండు ఎంపికలు కనిపిస్తాయని, ఒకటి వినియోగదారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసమన్నారు. ఐఎంఎల్ బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని, ఆ తర్వాత ప్రొడక్టును ఎంపిక చేయగానే మద్యం బాటిల్‌పై ఉన్న నెంబరు, ఎక్కడ తయారైంది, ఎటు నుంచి వచ్చింది.. బ్రాండ్ పేరు, ధర వివరాలన్నీ స్క్రీన్‌పై కనిపిస్తాయన్నారు. ఒకవేళ నకిలీ మద్యం అయితే డిటైల్స్ నాట్ ఫౌండ్ అని కనిపిస్తుందన్నారు. ఈ యాప్‌లోని సమాచారం జిల్లా కేంద్రంలోని అధికారుల డేటా బేస్‌కు వెళ్తుందని, బీర్ బాటిల్స్‌కు త్వరలో స్కాన్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ విధానం వల్ల జిల్లాలోని కల్తీ మద్యం అమ్మకాలకు అవకాశం ఉండదన్నారు.

గందరగోళం!

- రంగరాయలో పారామెడికల్ కోర్సుల సీట్ల భర్తీ కౌన్సెలింగ్‌లో అయోమయం
- మెరిట్ లిస్టులో ఉన్నా మెడికల్ సీటు రాలేదు: విద్యార్థులు
- అంత సజావుగానే జరిగింది: రంగరాయ ప్రిన్సిపాల్

కాకినాడ/జీజీహెచ్(కాకినాడ),అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ కౌన్సెలింగ్ గురువారం గందరగోళంగా జరిగింది. ఎంఎల్‌టీ, అనస్థీషియా, కార్డియాలజీ వంటి రెండేళ్లపాటు పారా మెడికల్ డిప్లమో కోర్సుల సీట్ల భర్తీకి సంబంధించి.. గురువారం రంగరాయ మెడికల్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరగ్గా విద్యార్థుల్లో అయోమయం నెలకొంది.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సతీష్, సెలక్షన్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ రజిని వ్యవహరించగా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.మొత్తం 101 సీట్లకుగాను 531మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మరో 25 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. పలు కోర్సులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోకపోవడం, రోస్టర్ ప్రకారం కేటగిరీ సంబంధిత అభ్యర్థులు లేకపోవడం, పలు కోర్సులపై నిరాసక్తత కారణంగా మరో 25 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. వీటిని మరో 10రోజుల్లో భర్తీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నవంబరు 2 లేదా 3వ తారీఖుల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి.

సమాచారం ఇవ్వకుండానే కౌన్సెలింగ్

మెరిట్ లిస్టులో పేరు ఉన్నా పారా మెడికల్ సీటు రాలేదని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసినట్టుగా సోషల్ మీడియాలో మీడియాలో వీడియోలు హల్‌చల్ చేశాయి. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కౌన్సెలింగ్ నిర్వహించారని పలువురు విద్యార్థులు వాపోయారు. స్నేహితుల ద్వారా కౌన్సెలింగ్ సమాచారం తెలుసుకుని వచ్చామని, తీరా ఇక్కడికి వస్తే సీట్లు భర్తీ పూర్తయ్యిందని చెబుతున్నారని ఓ విద్యార్థిని వాపోయింది. మెరిట్ లిస్టులో పేరున్న ఓ విద్యార్థిని ఎనస్థీషియా కోర్సులో చేరేందుకు కౌన్సెలింగ్‌కు హాజరైంది. స్టడీ సర్టిఫికెట్లు జెరాక్సు తీసుకురాగా, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. తమ ఇల్లు చాలా దూరమని అక్కడికి వెళ్లి తీసుకురావడం కష్టమని చెప్పినా కౌన్సెలింగ్ నిర్వాహకులు చెప్పినా వినిపించుకోపోలేదని ఆ విద్యార్థిని పేర్కొంది. తన సర్టిఫికెట్లు వెనక్కి ఇచ్చేయాలని కోరగా.. సీటు వద్దని రాసివ్వాలని కౌన్సెలింగ్ సిబ్బంది సూచించారని అంది. తనకు కార్డియాలజీ విభాగ కోర్సులోనైనా సీటు ఇవ్వాలని కోరినా రంగరాయ సిబ్బంది సానుకూలంగా స్పందించలేదని, ఇచ్చేయాలని వెనక్కి పంపారని, వారికి కావాల్సిన వారికి మాత్రం సర్టిఫికెట్లు లేకపోయినా తర్వాత ఇవ్వొచ్చు అంటూ సీట్లు కేటాయించారని కొందరు విద్యార్థులు వాపోయారు.

సరైన విధానంలోనే కౌన్సెలింగ్..

కౌన్సెలింగ్ రోస్టర్ పద్ధతిలో జరిపామని, ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ-1 ఉమన్, ఎక్స్‌సర్వీస్‌మెన్ సీట్లు ఖాళీ ఉన్నాయని, కౌన్సెలింగ్ వివరాలు వెబ్‌సైట్లో ఉంచామని, పేపరు ప్రకటన కూడా ఇచ్చామని రంగరాయ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. రెండో విడత కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, సీటు రాని వారు కంగారు పడొద్దని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు కచ్చితంగా తీసుకురావాలని సూచించారు. కౌన్సెలింగ్ పూర్తి పారదర్శకంగా జరుగుతోందని ప్రకటించారు. ఎటువంటి అవకతవకలకు చోటు లేదన్నారు.



పారామెడికల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమం పరిశుభ్రత దినంగా పాటించాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల మూడో శనివారాన్ని క్లీన్ ఎయిర్ థీమ్‌తో పౌరులకు వాయు కాలుష్యం, సంబంధిత ఆరోగ్య సమస్యలను తగ్గించడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తమ కార్యాలయాల్లో జరిగే పరిశుభ్రత కార్యక్రమాల్లో తప్పకుండా పాల్గొనాలన్నారు. వాయుకాలుష్యంపై అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గాలి నాణ్యతతో మెరుగుదల, కాలుష్య సంబంధిత నష్టాలను తగ్గించడం, మరింత ఆక్సిజన్ ఆరోగ్యకరమైన పౌరులుగా ఉండేందుకు నడకపై అవగాహన కల్పించాలన్నారు.

నేడు ఉద్యోగుల పీజీఆర్‌ఎస్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శుక్రవారం జరిగే ఉద్యోగుల పీజీఆర్‌ఎస్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 25వరకూ పొడిగింపు

కాకినాడరూరల్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 25 వరకూ పొడిగించినట్లుడీఈవో రమేష్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రభుత్వ పరీక్షల కార్యాలయ www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. పరీక్ష రుసుమును ఈనెల 27లోపు చెల్లించాలని, ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును డీఈవో కార్యాలయంలో29లోపు సమర్పించాలన్నారు. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్‌లోగానీ, డీఈవో కార్యాలయంలోగానీ సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధం కావాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం కాకినాడలో తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లాలో వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు.ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. ధాన్యంసేకరణకు సంబంధించి గన్నీ బ్యాగులు, ట్రాన్స్‌పోర్టుకు వాహనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈనేపథ్యంలో దానికి తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, రైస్‌మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రైస్‌మిల్లర్లకు ఇచ్చే బ్యాంకు గ్యారెంటీలపైనా ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించాలన్నారు. నిబంధనల ప్రకారం తేమశాతాన్ని పరీక్షించి ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను అనుసరించి ధాన్యం సేకరణ విజయవంతంగా చేయాలన్నారు. పౌరసరఫరాల సంస్థ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రవాణాశాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి డిప్యూటీ తహసీల్దారుపై విచారణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యు.కొత్తపల్లి మండలం డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణపై కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆర్డీవో మల్లిబాబు విచారణ చేశారు. డిప్యూటీ తహసీల్దారు హోదాలో ఆయన జారీ చేసిన ధ్రువపత్రాలు, లీగల్ హయర్ వంటి వివిధ అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేశారు. డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ అక్రమాలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సెల్ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాసరావు ఈనెల 13న పిఠాపురం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ కాకినాడ ఆర్డీవో మల్లిబాబును ఆదేశించారు. దీంతో గురువారం కాకినాడలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ విచారణ ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా యు.కొత్తపల్లి మండలానికి వెళ్లి కూడా విచారణ చేయాల్సి ఉందని తెలిపారు. విచారణ పూర్తయిన అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

కోటి రూపాయల స్కామ్ జరిగినా పట్టదా!

7

అనుమానంతో భర్త, అత్త వేధింపులు

- తొండంగిలో వివాహిత ఆత్మహత్య
- నువ్వంటే ఇష్టం.. మిస్‌యు అంటూ భర్తకు లేఖ

సత్యదీక్షలకు వేళాయె

6

- నేటి నుంచి ప్రారంభం... వచ్చే నెల 13న విరమణ



6

చీరమేను.. సందడి

చిందెలో చీర మేను..

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500





బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తులకు మహా స్నపనం (పక్కన) లక్ష తులసి పూజ

రాజాధిరాజా..

రాజాధిరాజ అలంకరణలో
గజ వాహనంపై శ్రీవారి విహారం
ఘనంగా లక్షతులసి పూజా మహోత్సవం
స్వామివారికి తిరుప్పావడ సేవ..
బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు





వరుసగా.. స్వామివారికి మిరియాల దండను తీసుకు వస్తున్న ఎమ్మెల్యే సత్యానంద రావు.. తిరుప్పావడ సేవ.. ప్రత్యేక నృత్య ప్రదర్శన



ఆత్రేయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఏడవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతమండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, స్నపనము వంటివి వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ డోనర్ బొరుసు భాస్కరరావు-వసుధ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రచారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు లక్ష తులసి పూజా మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్ ఎదురుగా అంతరాలయంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని కనులారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు అలంకృతుడై గజ వాహనం ఆధిరోహించి వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణతో తిరు వీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి మహాలడ్డు ప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వెంకన్న ఆలయంలో మహాలడ్డు ప్రసాదం

450 గ్రాముల ధర రూ.100.. ప్రారంభించిన బండారు

ఆత్రేయపురం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా మహాలడ్డు ప్రసాదాన్ని ప్రవేశపెట్టారు. తిరుమల తరహాలో లడ్డు ప్రసాదాన్ని నాణ్యతా ప్రమాణంతో నిర్వహిస్తున్నారు. 450 గ్రాములతో తయారు చేసిన లడ్డును బాక్సులో ప్యాక్ చేసి రూ.100 ధరతో భక్తులకు అందించేలా నిర్ణయించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రసాదాన్ని భక్తులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్








నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో టీడీపీ మహిళా నేతలు







పొలాల వెంబడి పరుగులు



యానాం గోదావరిలో భారీగా లభ్యమైన చీరమేను, కొనుగోలు దారులతో కిక్కిరిసిన పుష్కర ఘాట్



చీరమేను... సందడి

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500కు లభ్యం
- చౌక ధర అంటూ భారీగా తరలివచ్చిన కొనుగోలుదారులు
- మత్స్యకారులకు కాసుల వర్షం

యానాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో చీరమేను సందడి చేసింది. యానాం, గోదావరి జిల్లా వాసులు, మాంసాహారప్రియులు ఎంతో ఇష్టంగా తీనే చేరమేను దీపావళి ముందు ఎక్కువగా దొరుకుతుంది. తూర్పు గాలుల సమయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరితలంపైకి చేరుకుంటాయి. యానాంలో గురువారం అధిక సంఖ్యలో చీరమేను దొరికి మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఉదయం నుంచి పెద్ద మొత్తంలో చీరమేను మార్కెట్‌కు



రావడంతో రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పుష్కర ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్, బిందెల్లో (ఒక్కో బకెట్ సుమారు 10 లీటర్లు) చీరమేను లభ్యమైనట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం శేరు (ఒక లీటరు) రూ.2వేలకు పైగా అమ్ముడైంది. ప్రస్తుతం శేరు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. చీరమేను చౌకగా దొరుకుతోందని తెలియడంతో మాంసాహారప్రియులు భారీగా వచ్చారు. కొందరు సేర్లు, మరికొందరు బకెట్‌లతో కొనుగోలు చేశారు. దీపావళి ముందు రోజుల్లో చీరమేను పడటం సహజం. అయితే గోదావరిలో తెల్ల నీరు (మురికిగా కాకుండా) తేలిపోవడంతో చీరమేను అధిక సంఖ్యలో లభ్యమవుతోందని స్థానిక మత్స్యకారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సత్యదీక్షలకు వేళాయె

నేటి నుంచి ప్రారంభం... వచ్చే నెల 13న విరమణ



సత్యదీక్షా ధారణలో భక్తులు (పాత చిత్రం)

అన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ఇష్టమైన సత్య దీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఆశ్వయుజ మాసంలో మఖ నక్షత్రం నాడు మొదలయ్యే దీక్షలు కార్తిక మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో ముగుస్తాయి. వీటికి సంబంధించి దేవస్థానం యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. గిరిజన ప్రాంతాలు, అన్నవరం పరిసర ప్రాంతాల్లో దీక్షలు తీసుకునే ఆసక్తి ఉన్న 1,500 మందికి దీక్షా వస్త్రాలు, దీక్షా మాలలు ఉచితంగా అందజేశారు. సత్య రథం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గ్రామగ్రామాన ప్రచారం గావించారు. 27 రోజులు అత్యంత నియమనిష్టలతో దీక్ష ఆచరించాలి. 27 రోజులు దీక్ష కుదరని మహిళలు, ఇతరులు 18 రోజులు, 9 రోజులు దీక్ష స్వీకరించవచ్చు. దీక్ష ఎక్కడ తీసుకున్నా సత్యదేవుని సన్నిధిలోనే ఇరుముడి సమర్పించి విరమించాలి. 27 రోజుల దీక్షలు ఈ నెల 17న, 18 రోజుల దీక్ష ఈ నెల 26న, 9 రోజుల దీక్ష వచ్చే నెల 4న స్వీకరించాలి. దీక్ష ఎప్పుడు తీసుకున్నా నవంబరు 13న విరమించాల్సి ఉంటుంది. దీక్షా కాలంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఉండాలి. పసుపు రంగు దుస్తులు ధరించి మగవారిని సత్యదేవ, ఆడవారిని సత్యదేవిగా సంబోధించాలి. త్రికరణ శుద్ధిగా బ్రహ్మచర్యం పాటించాలి. ధూమపానం, మద్యపానం వదిలి మాంసాహారం భుజించకూడదు. నేలపైనే నిద్రించాలి. అబద్ధమాడరాదు. ఎంతో నియమనిష్టలతో ఆచరించడం ద్వారా ఆయురారోగ్యాలు కలిగి సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



శ్రీనివాసరావుకు పతకాలు, మెమెంటో అందజేస్తున్న నేషనల్ రిఫరీ లక్ష్మీదయానంద

ఆయన ఖాతాలో మరో నాలుగు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ, జనవరిలో బెంగళూరులో జరిగే మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మొత్తం 91 పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు తెలిపారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

'విద్యా రంగం అభివృద్ధికి ఎన్‌సీఈఆర్‌టీ కృషి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది... అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సంస్కరణలతో విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలంలోని ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్, హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పటిష్టమైన పనితీరు కనబర్చాలన్నారు. టెస్ట్, నోట్ పుస్తకాలను సమగ్రంగా పర్యవేక్షించాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య బోధించాలన్నారు. పాఠ్య పుస్తకాల్లోని పలు అంశాలను వివిధ స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు బోధించే పద్ధతి, మూల్యాంకనంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తరచూ పునశ్చరణ తరగతులు నిర్వహించుకుని బోధనా సామర్థ్యాలను మరింత పెంచుకోవాలని కోరారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండడాన్ని గమనించి అందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. తరగతి గదుల్లోకి వెళ్లి పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ రైటర్ రమేష్, డీవైఈవో కేవీవీ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, కందుకూరి పాల్‌రాజు, ఉద్దగిరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

50 అత్తాలు... 850 కాయలు

కర్పూర రకానికి చెందిన ఒక అరటి చెట్టు ఏకంగా 50 అత్తాలతో అబ్బురపరుస్తోంది. కాకినాడ జిల్లా కరపలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు ఇంటి పెరట్లోని అరటి చెట్టుకు 50 అత్తాలుండగా ఒక్కో అత్తానికి 15 నుంచి 17వరకు కాయలున్నాయి. దాదాపు 850 కాయలున్నాయని ఆయన కుమారుడు వీరేష్ లెక్కకట్టి చెప్పాడు.

- కరప (ఆంధ్రజ్యోతి)





బాలబాలాజీస్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా స్నపన తిరుమంజనం

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో రెండో రోజుకు పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం స్నపన తిరుమంజన సేవ కనుల పండువగా జరిగింది. చతుస్థానార్చనలతో ప్రారంభమైన ఉత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రారోహణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 27 కలశల్లో తీసుకువచ్చిన పంచామృతాలు, 11 రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, ఉద్ధ జలాలతో బాలబాలాజీ స్వామితో పాటు పద్మావతీదేవి, ఆండాళ్‌తాయార్‌లకు తిరుమంజనం జరిపారు. అనంతరం ప్రాయశ్చిత హోమం, నివేదన, తీర్థ ప్రసాదగోష్ఠి, చతుస్థానార్చనలు, మంగళాశాసనం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల మనసులను రంజింపచేశాయి. శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చినజీయర్ స్వామిజీ శిష్య బృందం, గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి జిల్లాల గొప్పతనాన్ని చెప్పేందుకే

ఆహార పదార్థాల ప్రదర్శన

● నన్నయ వీసీ ప్రసన్నశ్రీ ● ముగిసిన ఆహార మహోత్సవ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడురోజులపాటు జరిగిన ఆహార మహోత్సవ్ కార్యక్రమం గురవారంతో ముగిసింది. మూడోరోజైన గురువారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పశ్చిమగోదావరిజిల్లా ఫుడ్‌స్టాల్ ప్రదర్శన కార్యక్రమం జరిగింది. నన్నయ అనుబంధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరై 84 స్టాల్స్‌లో తమ ఆహారపదార్థాలను ప్రదర్శించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు ఆశక్తిగా తిలకించారు. ఈసందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యకరకరమైన అలవాట్లను, వంటకాలను ఆరోగ్యకరమైన జీవితాన్ని గోదావరిజిల్లా గొప్పతనాన్ని తెలియజేసే ప్రయత్నమే ఈకార్యక్రమం లక్ష్యం అని అన్నారు. తమ లక్ష్యం నెరవేరిందని చెప్పారు. అనంతరం శాఖాహార, మాంసాహార విభాగాలలో విజేతలైన వారికి వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. రెండురోజుల ఆహార మహోత్సవ్‌లో స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన వారికి ప్రసంశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్‌లు పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు టి.హైమావతి, బి.ఉషశ్రీ, శాంతరాజ్యం, ఎం.ఎం.కృష్ణవేణి,టి.సింధూజ పాల్గొన్నారు.

విజేతలు వీరే

● శాఖాహారవంటకాలలో మొదటిస్థానం సున్నుండలు, కారప్పూస చేసిన హయగ్రీవ బీఈడీ కళాశాల చింతలపూడి డి.కీర్తి, చల్లా స్వర్ణలత, రెండో స్థానం కొబ్బరిపాలతో వంకాయపచ్చడి చేసిన విశ్వవిద్యాలయం మెకానికల్ విద్యార్థి జి.ఆదర్శ్, మూడోస్థానం గోంగూర బిర్యానీ, సొరకాయ హల్వా, లచ్చించారు, ఉలవచారు చేసిన బి.వి.రాజు కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను ఎస్.కె.సుల్తానా, కె.అమృత, డాక్టర్ ఉమామణి, ఎం.హర్షితనాగశ్రీ, దేవలాల్ అందుకున్నారు.

●మాంసాహార వంటకాలలో మొదటి స్థానం ఎండుచేపకూర చేసిన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహం విద్యార్థులు, రెండోస్థానం చికెన్ ఫ్రైడ్‌రైస్ చేసిన నన్నయ విశ్వవిద్యాలయం కుమారి, మూడోస్థానం కుండలో కోడికూర, చద్దెన్నంకు ఫిజిక్స్ విభాగం నుంచి క్రాంతి అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు నన్నయ విశ్వవిద్యాలయం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం నుంచి జి.చంద్రకళ, తాడేపల్లిగూడెం ప్రాంగణం నుంచి ఎస్.ఉషారామ్, బీఈడీ విద్యార్థి జి.రమ్యా, ఎంబీఏ విద్యార్థి వి.సాహితీలు అందుకున్నారు.

అనుమానంతో భర్త, అత్త వేధింపులు

● వివాహిత ఆత్మహత్య
● నువ్వంటే నిజంగా చాలా ఇష్టం అంటూ లేఖ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

తొండంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నంలో భర్త వేధింపులు, అత్త సూటిపోటీ మాటలు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళంజిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన గొర్లి బుద్ధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో నివాసముంటున్నారు. ఈయన కుమార్తె శిరీష బీకాం కంప్యూటర్స్ చదివింది. ఈమెకు గత మేనెల 15న పాతపట్నం గ్రామానికి చెందిన ఏనుగుతల ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగింది. ప్రదీప్ తొండంగి మండలంలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తుండగా భార్యాభర్తలతో గోపాలపట్నంలో ఆగస్టు నెలలో కాపురం పెట్టించారు. వీరింటికి తరచూ ప్రదీప్ తల్లి ఏనుగుతల నాగమ్మ వచ్చి వెళ్తా ఉండేది. తల్లి మాటలు విని ప్రదీప్ తన భార్యను తరచూ వేధించేవాడు. ఫోనులో శిరీష ఎవరితోనో ఛాటింగ్ చేస్తోందన్న అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తుండేవాడు. అనుమానంతో భర్త కొడుతున్నాడని, వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు ఆమె ఫోన్‌చేసి చెప్పి ఏడ్చేది. బుధవారం కూడా తల్లిదండ్రులకు వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్ చేసి చెప్పింది. వాళ్లు మళ్లీ ఫోన్ చేయగా తీయడంలేదు. దీంతో అనుమానం వచ్చి వారు గోపాలపట్నం బయలుదేరి వచ్చారు. అప్పటికే శిరీష చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో తన మృతికి తన అత్త నాగమ్మ, భర్త ప్రదీప్‌లే కారణమని ఉంది. తనకు, భర్త అనుమానిస్తున్న వ్యక్తికి ఎటువంటి సంబంధంలేదని, భర్త పెడుతున్న వేధింపులు భరించడం తనవల్ల కావడం లేదని లేఖలో పేర్కొంది. ఎటువంటి గొడవలు పడకండి, నువ్వు మంచిగా ఉండు.. నువ్వంటే చాలాఇష్టం.. మిస్ యు ప్రదీప్ అంటూ ముగించింది. దీనిపై మృతురాలి తండ్రి బుద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తహశీల్దార్ కాంతారావు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

ద.మ.రైల్వే పీసీఎండీ హెల్త్ యూనిట్ తనిఖీ


హెల్త్ యూనిట్‌ని పరిశీలిస్తున్న పీసీఎండీ డాక్టర్ నిర్మలా రాజారామ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్ గురువారం రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. కాకినాడ నుంచి మధ్యాహ్నం చేరుకొని రైల్వే హెల్త్ యూనిట్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్(ఏఆర్ఎంవీ)ని పరిశీలించారు. హెల్త్ యూనిట్‌లోని ఫార్మసీ, ల్యాబ్, రిజిస్టర్లు చూశారు. రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఏఆర్ఎంవీలోని అత్యవసర వైద్యఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిరిగి కాకినాడ వెళ్లారు. కార్యక్రమంలో సీఎండీ డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, సీనియర్ డీఎంవో డాక్టర్ సునీల్ కుమార్, డీఎంవో డాక్టర్ వెంకమాంబ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి స్కామ్ జరిగినా పట్టదా!

● బ్యాంకు అధికారుల తీరుపై డ్వాక్రా సభ్యుల నిరసన
● వేళంగి ఎస్‌బీఐ బ్రాంచిని ముట్టడించిన మహిళలు, గ్రామస్థులు


వేళంగి స్టేట్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న కూరాడ డ్వాక్రా సభ్యులు, గ్రామస్థులు

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోటి రూపాయల స్కామ్ జరిగినా మిన్నకుండిపోయిన బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ కాకినాడజిల్లా కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన పలువురు బాధిత డ్వాక్రా సభ్యులు గురువారం వేళంగి స్టేట్‌బ్యాంక్‌ను ముట్టడించారు. ప్రధానద్వారం ఎదుట బైఠాయించి ఉద్యోగులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కడుపు కట్టుకుని నెలవారీ రుణ వాయిదాలను చెల్లిస్తే బ్యాంకులో జమచేయకుండా నొక్కేసిన బీసీ పాయింట్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతి, ఆమెకు సహకరించిన యానిమేటర్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కనెల వాయిదా కట్టకపోయినా ఉపేక్షించని బ్యాంకు అధికారులు ఏళ్ల తరబడి 85 సంఘాలకు చెందిన దాదాపు రూ.99లక్షలు పక్కదారి పట్టినా పట్టించుకోకపోవడంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన అవకతవకలు, అక్రమాల్లో వారి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. పొదుపు సొమ్ములను వాయిదాలకు జమవేసుకోవడంపైనా బాధితులు తీవ్రంగా స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎస్‌బీఐ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బాధిత మహిళా సంఘాల సభ్యులకు సంఘీభావంగా గ్రామస్థులు కూడా బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి ఆందోళనకారులు, బ్యాంకు సిబ్బందితో చర్చించారు. బ్రాంచి మేనేజర్ వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇస్తేనేగానీ కదిలేది లేదని బాధితులు భీష్మించుకుని కూర్చున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏబీఎం ఫల్గుణరావు బాధితులతో చర్చించారు. ఉన్నతాధికారులకు నివేదించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆయనకు ఫిర్యాదు పత్రాలను అందించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆందోళనలో ఎంపీటీసీ గుత్తుల శాంతిబాలాజీ, జేఎస్పీ నాయకుడు వెలుగుబంట్ల గంగాధర్, వైసీపీ నాయకుడు వెలుగుబంట్ల నారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోశారు..

● గోకవరం ప్రభుత్వాసుపత్రిలో ఘటన


గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న వైద్యాధికారి రామలక్ష్మి

గోకవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఓ అరుదైన సంఘటన చోటుచేసుకొంది. ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించాలంటూ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీపీఆర్‌పై పోస్టర్స్ ద్వారా ప్రజలకు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో ఏజెన్సీ ప్రాంతంలోని పాతరామవరం గ్రామానికి చెందిన కె.వెంకట రమణ అనే వ్యక్తి పాము కాటుకు గురై, గుండె పోటురావడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. దీంతో కటుంబ సభ్యులు హుటాహుటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసికొచ్చారు. ఇంతలో సీపీఆర్‌పై డెమో రూపంలో వివరిస్తున్న వైద్యాధికారిణి రామలక్ష్మికి విషయం తెలిసి వెంటనే బాధితుడువద్దకు పరుగులు తీశారు. వెంటనే వైద్యురాలు రామలక్ష్మి, వైద్య సిబ్బంది సుమారు 6 నుంచి 10నిమిషాలపాటు వెంకటరమణకు సీపీఆర్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి అతనిని గట్టెక్కించారు. తరువాత కొద్దిసేపటికి బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ఆమె గుర్తించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగానే ఉందని, ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది తెలిపారు. గుండెపోటుకు గురైన వ్యక్తులను ఏ విధంగా రక్షించుకోవాలో తెలిపేందుకు ప్రభు త్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపీఆర్ కార్యక్ర మం ఓ నిండు ప్రాణాన్ని కాపాడటంపట్ల వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

రాఘవాపురంలో

గ్రావెల్ తవ్వకాలు

● పరిశీలించిన మైన్స్ అధికారులు
● సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం


అక్రమ తవ్వకాలను పరిశీలించిన మైనింగ్ అధికారులు


మైనింగ్ అధికారులు సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం

కోరుకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న సమాచారంపై జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసినట్లు జిల్లా మైన్స్అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుంతలు, తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి (చైన్ మౌంటెడ్ పాన్) యంత్రాన్ని గుర్తించారు. అక్కడ ఉన్న ఆపరేటర్ మురమల్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ప్రదేశానికి ఎటువంటి శాఖాపరమైన అనుమతులు లేవని నిర్ధారించడంతో, ఇది అక్రమ తవ్వకంగా గుర్తించారు. అనంతరం సర్వే నెం.44/2,44/3లోని ప్రాంతంలో తవ్వకాలు జరిగినట్లు గుర్తించి కొలతలు వేయగా, మొత్తం 19,300క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వినట్లు తేలింది. ఆ భూమి వంక బరాజు వెంకట సర్వేశ్వరరావు, వంక వరల క్ష్మి, గునమూరి ఆనందలక్ష్మి, వంక సూర్య కుమారిలకు చెందిందని రాఘవాపురం గ్రా మ రెవెన్యూ అధికారులు తెలిపారు. అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటా చి యంత్రాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రాఘవాపురంలో భద్రపరిచారు. అనుమతి లేని ప్రాంతాలలో తవ్వకాలు నిర్వహిం చినట్లయితే సంబంధితులపై గనులు, భూగర్భశాఖచే కఠినచర్యలు తీసుకుంటా మని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన గనులలోనే తవ్వకాలు, రవాణా నిర్వహించాల్సిందిగా సూచించారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం


అమలాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం బస్టాండులో బస్సు ఎక్కుతున్న సమయంలో ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ నేతృత్వంలో క్రైమ్ సిబ్బంది సహకారంతో కేసును ఛేదించారు. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన జడ్డు ముత్యవతి (61) అనే మహిళను అరెస్టుచేసి ఆమె వద్ద నుంచి 66.270 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ గురువారం వెల్లడించారు. ఇమ్మిడివరప్పాడుకి చెందిన వెలిగంటి లీలావతి ఈనెల 4వ తేదీన బస్సు ఎక్కేందుకు అమలాపురం డిపోకు రాగా బంగారు ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. అందులో నల్లపూసల దండ, నక్లెస్‌తో పాటు వివిధ రకాల ఆభరణాలు ఉన్నాయి. దీంతో లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జీశ్రీనివాస్ గురువారం రాత్రి వెల్లడించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ యువతి కర్రి వంశీతోపాటు ఓ మైనర్‌ను ప్రేమించింది. దీనిపై వీరి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో బాలుడు సదరు యువతిని స్కూటర్ ఎక్కించుకుని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి మైనర్ బాలుడు, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని అన్నవరం, కత్తిపూడి మీదుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకువెళ్లారు. కాగా, ఇద్దరిలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. అక్కడ చేబ్రోలుకి చెందిన వాడబోయిన సాంబశివ అలియాస్ సాంబ అనే వ్యక్తి యువతిని బెదిరించాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మైనర్ బాలుడు, కర్రి వంశీ, రాజును చేబ్రోలు కోకోపామ్ వద్ద గురువారం అరెస్టు చేశారు. నేరానికి ఉపయోగించిన కారును స్వాధీన పర్చుకున్నారు. మరో ముద్దాయి సాంబ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జడ్.మేడపాడులో రైల్వేగేటును ఢీకొట్టిన క్వారీ లారీ

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేపాడులో రైల్వేగేటును గురువారం ద్వారపూడి వైపు నుంచి వచ్చిన క్వారీ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటనపై రైల్వే అధికారులు లారీ యాజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేటు మరమ్మతులు చేస్తే గానీ గేటు తెరుచుకోదని అధికారులు తెలిపారు.

తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు

● ల్యాప్‌టాప్‌తో సహా కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

అమలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటే వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమిత్తం రూ.50 వేలు లంచం తీసుకుంటూ తహశీల్దార్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో రెవెన్యూఉన్నతాధికారి ఒకరిని ఏసీబీ అధికారులు విచారించినట్టు సమాచారం. తహశీల్దార్ నివాసం ఉంటున్న అమలాపురం కామనగరువు రోడ్డులో ఉన్న ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. సుమారు 25 మందికిపైగా ఏసీబీ అధికారులు బృందాల వారీగా విడిపోయి అమలాపురంలో బుధవారం మకాం వేసినట్టు తెలిసింది. కీలకమైన ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర ఆధారాలు లభ్యం కావడమే కాకుండా ఆయన ఒక విలాసవంతమైన ఇల్లు నిర్మిస్తున్నట్టు గుర్తించారు. కాగా, తహశీల్దార్‌ను అక్రమంగా ఏసీబీ కేసులో ఇరికించారంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నట్టు సమాచారం. విచారణ అనంతరం గురువారం తెల్లవారుజామున తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటాఎంట్రీ ఆపరేటర్ రాములను ఏసీబీ కోర్టులో హాజరు పరిచేందుకు అధికారులు తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై గురువారం పి.గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ యువతి ఈనెల 14న పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వచ్చింది. తన బావ ఊరు వెళ్లడంతో అక్కకు తోడుగా ఉండేందుకు వచ్చిన యువతి గురువారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఉదయం ఐదుగంటల సమయంలో చెల్లి లేకపోవడాన్ని గమనించిన అక్క బంధువులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఎంతకీ ఫలితం లేకపోవడంతో సదరు యువతి బంధువులు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

ఆభరణాల చోరీపై

కేసు నమోదు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్ రోడ్డులో బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురికావడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి .... పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏడిద వీరవెంకటలక్ష్మి కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాదులో కూరగాయలు షాపు నిర్వహించుకుంటున్నారు. హైస్కూల్ రోడ్డులో ఉన్న ఇంట్లో ఒక పోర్షన్‌ను అద్దెకు ఇవ్వగా, వారు నివసించే పోర్షన్‌కు తాళం వేసుకున్నారు. ఈక్రమంలో ఆగస్టు 24 వ తేదీన వీరవెంకటలక్ష్మి కుటుంబం పెళ్లి నిమిత్తం స్వగ్రామానికి వచ్చి తిరిగి పయనమయ్యారు. కాగా, ఈనెల 9వ తేదీన ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చి ఇంటిని పరిశీలించగా 16 గ్రాముల బంగారం ఆభరణాలు, 15 తులాలు వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. దీంతో వీరవెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

తండ్రీ, కొడుకుల

ఆత్మహత్య కేసులో ముగ్గురిపై కేసు

ఆలమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం జరిగిన ఆత్మహత్యలకు సంబంధించి ముగ్గురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పావులూరి కామరాజు తన కుమారులైన అభిరామ్, గౌతమ్‌ను హతమార్చి తాను కూడా ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.దీంతో చిలకలపాడుకు చెందిన పాలువూరి దుర్గారావు, కొల్లప్రోలు తలుపులు, కొల్లప్రోలు శ్రీనివాస్ వేధింపులు భరించలేకే తాను తన కుమారులు చనిపోతున్నట్టు ఆత్మహత్యకు ముందు కామరాజు సెల్ఫీ వీడియో తీశాడు. ఈ మేరకు వారి ముగ్గురిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్ఐ జీ.నరేష్ తెలిపారు.

పోస్టుమార్టం పూర్తి..

గురువారం మూడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం బంధువులకు అప్పగించారు. బుధవారం సాయంత్రానికి ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు రావడం ఆలస్యమైంది.

లారీ ఢీకొని ఒకరి మృతి / ● మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద ప్రమాదం


మృతిచెందిన వెంకటేష్

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. మండపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఇప్పనపాడుకు చెందిన సిద్దాంతపు వెంకటేష్ (35)గా గుర్తించారు. మృతుడుకి భార్య, కుమారుడు వున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మండపేట రూరల్ ట్రైని ఎస్ఐ సోమేంద్ర తెలిపారు.

తాండవ నదిలో స్నానానికి దిగి ..


నీటిలో తేలియాడుతున్న పెద్దింట్ల మృతదేహం

కోటనందూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్లమూరి పెద్దింట్ల అనే శ్రీను కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు. బుధవారం యధావిధిగా పని నుంచి ఇంటికి వచ్చే సమయంలో తాండవ నదిలో స్నానానికి దిగి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది ఎంత వెతికినా కనిపించలేదు. గురువారం ఉదయం నదిలో శవమై కనిపించాడు. భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నేడు బాణసంచా పేలుడు ప్రదేశానికి విచారణ బృందం రాక

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న రాయవరంలో జరిగిన బాణసంచాపేలుడు సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ అధికారులు బృందం శుక్రవారం ఆప్రదేశానికి రానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ అధికారులుగా మున్సిపల్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్.హరికృష్ణను నియమించారు. ఈ బృందం వచ్చిన తర్వాత విచారణ జరిపి తమ నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించనుంది.కాగా, మృతిచెందిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడనివారే నని, వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి మృతులకుటుంబాలను ఆదుకోవాలని మృతుల కుటుంబాలకు చెందినవారితో పాటు ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

● సూర్యారావుపేటలో ఘటన

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య, భర్త మధ్య తలెత్తిన వివాదం కారణంగా వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజానగరం గ్రామ పంచాయతీ పరిధి సూర్యారావుపేటకు చెందిన నాగరాజు శ్రీజ్యోతి (25) అనే వివాహిత, భర్త కృష్ణ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీజ్యోతి తల్లి దుబాయ్‌లో ఉంటూ అప్పుడప్పుడు కూతురికి కొంత డబ్బులు పంపిస్తుంటుంది. వీటిని మృతురాలి భర్త వృథాగా ఖర్చు చేస్తుంటాడు. ఈ విషయమై భార్యభర్త మధ్య మాటామాటా పెరిగి గొడవలు పడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శ్రీజ్యోతి గురువారం చీరతో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఏడాదిన్నర, ఎనిమిది నెలలు వయసు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైళ్లలో దీపావళి సామగ్రి రవాణా చేస్తే జైలు

● దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో రైళ్లలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా సామగ్రి రవాణా చేసే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని సామర్లకోట రైల్వేస్టేషన్ పరిధిలో బాణసంచా తయారీ సంస్థలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి అనధికారికంగా బాణసంచా సామాగ్రిని వివిధప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. బాణసంచా, పేలుడు పదార్థాలను రైళ్లలో తీసుకెళ్లకుండా చూడాలని సామర్లకోట రైల్వే అధికారులను హెచ్చరించింది. ఒకవేళ ప్రయాణికులు బాణసంచాతో పట్టుబడితే రూ. వెయ్యి జరిమానా (లేదా) మూడునెలల జైలు విధిస్తామని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీఏ విద్యుత్ సబ్ స్టేషన్ లైన్‌వర్క్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్డీఆర్ఎస్ ప్రభాకర్ తెలిపారు. అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏడీఈ కిరణ్, ఏఈ నాగేశ్వరరావు చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం


కాకినాడలో జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ


పిఠాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు


పెద్దాపురంలో ర్యాలీలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు

జీఎస్టీ 2.0తో సామాన్యులకు ప్రయోజనం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో నిత్యావసరాలు, ఇతర వస్తువుల ధరలు తగ్గడంతో సామాన్య ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సర్పవరం కూడలిలో రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు ప్రసంగించారు. పన్ను భారం తగ్గించడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ముఖ్యంగా లాజిస్టిక్ రంగానికి సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. జీఎస్టీ శ్లాబులు తగ్గడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. సర్పవరం కూడలి నుంచి నాగమల్లితోట కూడలి వరకు బైక్, ఆటో, మినీ వ్యాన్లతో ఏర్పాటుచేసిన ర్యాలీని ఎంపీ, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, రామదేవు సీతయ్య దొర, తాటికాయల వీరబాబు, పుల్ల శ్రీరాములు, సోదె ముసలయ్య, గోపు వెంకటరమణ, జీని శ్రీనివాస్, రంబాల వెంకటేశ్వరరావు, పలివెల త్రిమూర్తులు, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ శ్లాబుల సవరణ ద్వారా అన్ని రకాల వస్తువుల ధరలను తగ్గించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. రవాణా, వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై పట్టణంలో నిర్వహించిన మోటార్ సైకిల్, ఆటో, ట్రాక్టర్లు, కార్ల ర్యాలీని వారు ప్రారంభించారు. అనంతరం బంగారమ్మరావిచెట్టు సెంటర్లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ధరల తగ్గింపు ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదం చేస్తుందన్నారు. రవాణా శాఖ అధికారులు సబిత నీలి, శ్వేత సాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు జరుగుతుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై పట్టణంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో అయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, పొలమరశెట్టి సత్తిబాబు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


నిర్మలారాజారాం దంపతులకు ఆశీర్వచనం ఇస్తున్న వేదపండితులు

భీమేశ్వరస్వామికి రైల్వే మెడికల్ ఉన్నతాధికారి పూజలు

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే మెడికల్ ఉన్నతాధికారి డాక్టర్ నిర్మలారాజారాం దంపతులు గురువారం కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. వారికి ఆలయ సిబ్బంది, అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో ఉపాలయాలను దర్శించిన అనంతరం భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. నిర్మల దంపతులకు నంది మండపం వద్ద వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. ఈవో నీలకంఠం, సామర్లకోట రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దీప్తికి బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్

ఆటోలో మర్చిపోయిన బ్యాగ్ అందజేత

కాకినాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన బీజే దీప్తి అనే మహిళ గురువారం ఆ గ్రామ కూడలిలో ఆటో ఎక్కి కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయ కూడలిలో దిగింది. అనంతరం హ్యాండ్‌బ్యాగ్ చూసుకునేసరికి కనిపించలేదు. ఆటోలో మర్చిపోయానని గ్రహించి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సీఐ కేవీఎస్ సత్యనారాయణ తన బృందంతో గాలించి ఆటోను గుర్తించారు. సుమారు రూ.70వేలు విలువ చేసే బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు ఉన్న బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ సీఐ సమక్షంలో బాధితురాలికి అప్పగించాడు. పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు దీప్తి కృతజ్ఞతలు తెలిపింది.


జెండా ఊపి ట్రైనింగ్ బస్సుని ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్టీసీ అధికారులు

హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాకినాడ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతుల 21వ బ్యాచ్ గురువారం ప్రారంభమైంది. డిపో మేనేజరు మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆర్టీసీ ఈడీ విజయరత్నం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో సుధ, జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు శిక్షణ తీసుకునే డ్రైవర్లకు మెటీరియల్ బుక్స్ అందజేశారు. శిక్షణకు వచ్చిన మహిళ సీహెచ్ కుమారిని వారు అభినందించారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ముందుకు రావాలన్నారు. డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎం.రామారావు పాల్గొన్నారు.

'రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి'

తాళ్లరేవు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి లాభాలు పొందేందుకు కృషి చేయాలని వ్యవసాయశాఖ అధికారి ప్రశాంతి కోరారు. గురువారం పి.మల్లవరంలోని దడాల సత్తికొండ పొలంలో 'పొలంబడి' నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ట్రైనీ ధనలక్ష్మి మాట్లాడుతూ రైతులు సాగులో రసాయనిక ఎరువులు, కెమికల్స్ తగ్గించి కషాయాలను అలవాటు చేసుకోవాలన్నారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, రైతులు దడాల ప్రసాద్, వనిమిశెట్టి బాబు, చిట్టూరి శ్రీనివాసరావు, యడ్ల సుబ్బారావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు వంశీకృష్ణ, అధికారులు

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పేద బాలికలకు సైకిళ్ల పంపిణీ

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా కాకినాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 18 మంది పేద బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. గురువారం నగరంలోని ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రీజనల్ మేనేజరు వంశీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు విద్యనందించడం ద్వారా కుటుంబానికి, దేశానికి ప్రకాశవంతమైన భవిష్యత్తు నిర్మించగలమన్నారు. ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ స్కాలర్‌షిప్ కార్యక్రమం ద్వారా 9 నుంచి 12వ తరగతి వరకు 75 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'పదో తరగతి సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలి'

కాకినాడ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సిలబస్‌ను ప్రణాళిక ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. కాకినాడ డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆయన కాకినాడ శశికాంత్‌నగర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అపార్ జనరేషన్, ఎఫ్ఏ-1 మార్కుల నమోదు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఆధార్ ప్రత్యేక క్యాంపుల నిర్వహణ, పదో తరగతి నామినల్ రోల్స్, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఎన్ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. డీవైఈవో సత్యనారాయణ, డీసీఈబీ ఇన్‌చార్జి ఏసీఈ వెంకట్రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

'పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు విడుదల చేయించాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు 12 నెలల గౌరవవేతనం బకాయిలు రూ.50కోట్లు విడుదల చేయించాలని క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు పాస్టర్ మోసా అబ్రహం, రాష్ట్ర నాయకులు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపీ స్పందిస్తూ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోజెస్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి ఎస్.ప్రభాకర్, సలగల విజయకుమార్, ఎం.సాల్మన్‌రాజు, కె.శామ్యూల్, పి.వినయ్ కుమార్, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.


ఎంపీ సతీష్‌బాబుకి వినతిపత్రం ఇస్తున్న క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు




కాకినాడలో బహుమతి ప్రదానం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి, పిఠాపురంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వరలక్ష్మి

ముగిసిన పోషణ మాసోత్సవాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ పరిధిలో సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ముగింపు, అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి పోషణ ఉత్సవాల్లో ప్రతి సచివాలయం నుంచి ఎంపికైన విజేతలకు, వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు, పురుషులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, వ్యాసరచన, వక్తృత పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ధాత్రి మదర్ మిల్క్ బ్యాంక్ మేనేజరు శివమాధవ్, సుషేణ హెల్త్ ఫౌండేషన్ డాక్టర్ వరలక్ష్మి, ఎన్ఆర్సీ డైటీషియన్ బుల్లయ్య, సూపర్‌వైజర్లు దయామణి, శ్రీగౌరి, అరుణశ్రీ, జానకి, అరుణ, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నెల రోజులు నిర్వహించిన పోషణ మాసోత్సవాలు ముగిశాయి. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఊబకాయం సమస్యలు, పోషక విలువలు కలిగిన ఆహారం తదితర అంశాలపై ప్రముఖ వైద్యురాలు, జనసేన నాయకురాలు డాక్టర్ వరలక్ష్మి అవగాహన కల్పించారు. చిన్నారులకు అధిక బరువుతో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో పనులను తక్షణం పూర్తి చేయాలి: ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని కళాశాల బాలికల వసతిగృహంలో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అబ్దుల్ మతిన్ ఆదేశించారు. గురువారం ఆయన కళాశాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులు, ఏమే వసతులు కల్పించాలి తదితర అంశాలను పరిశీలించారు. డీఈఈ శ్రీనివాస్, ఏఈ పి.కృష్ణ, వసతిగృహ సంక్షేమాధికారి కామేశ్వరి పాల్గొన్నారు.

నేను ప్రజల మనిషిని... టీడీపీ ఫైర్‌బ్రాండ్‌ని

పిఠాపురం ప్రజలకు నా గురించి తెలుసు
లోకేశ్ ప్రమోషన్ చూడాలని ఉంది
మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాను ఎల్లప్పుడూ టీడీపీ ఫైర్‌బ్రాండ్‌నేనని, ప్రజల మనిషి అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. విశాఖపట్నానికి గూగుల్ ఏఐ హబ్ తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌లకు అభినందనలు తెలుపుతూ గొల్లప్రోలులో గురువారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. సంబరాలు జరుపుకుని కేక్ కట్ చేశారు. అనంతరం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు వర్మ సమాధానాలిచ్చారు. కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ వర్మనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంపై స్పందిస్తూ.. ఆయన నేరుగా మాట్లాడిన వీడియో ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్‌లకు తాను ఏమిటో తెలుసు, వారంటే ఎంత ఇష్టమో వారికి పూర్తి అవగాహన ఉంది, వారి ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తానని తెలుసని చెప్పారు. పిఠాపురం టీడీపీ, వర్మ ఎల్లప్పుడూ క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తారని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్ సూచనలకు అనుగుణంగా ఎన్నికల్లో తాను, తన భార్య, కుమారుడితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలు కూటమి విజయానికి కష్టపడి పని చేశారని వివరించారు.

ఎవరో ఖర్మ, గడ్డి పరక అంటే నాకేంటి, నేను అంటే ఏమిటో, నా వ్యక్తిత్వం ఏమిటో, నియోజకవర్గం కోసం గత 23 సంవత్సరాలుగా ఎలా పని చేస్తున్నానో ప్రజలకు తెలుసనని వర్మ తెలిపారు. వర్మకు అది లేదు, ఇది లేదు అంటే ఉందో లేదో నియోజకవర్గానికి పూర్తిగా అవగాహన ఉందన్నారు. మరో 10 సంవత్సరాలు కూటమి ఐక్యత, బలోపేతం గురించి పనిచేస్తానని చెప్పారు. తాను ఎల్లప్పుడూ ప్రజల మనిషినని, అర్ధరాత్రి వచ్చి ఎవరు తలుపుతట్టినా స్పందించి పనిచేసే తత్వాన్ని చంద్రబాబు నేర్పించారని తెలిపారు. ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలను తాను ఎల్లప్పుడూ పాటిస్తానని స్పష్టం చేశారు. కూటమిలో ఉన్నాం, కొన్ని లక్ష్మణరేఖలు, నియమాలు ఉంటాయి... వాటిని దాటకుండా పనిచేయాలన్నారు. లోకేశ్‌కు ప్రమోషన్ వస్తే తన కళ్లతో చూడాలని ఉందన్నారు.



గొల్లప్రోలులో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ


పతకాలు సాధించిన మహాలక్ష్మి, వైష్ణవిలతో కోచ్ లక్ష్మణరావు

బాక్సింగ్, ఉషు పోటీల్లో ఇద్దరికి పతకాలు

పిఠాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్, ఉషు పోటీల్లో పిఠాపురం క్రీడాకారులు మూడు పతకాలు సాధించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాక్సింగ్ పోటీలు 51 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి కాంస్య పతకం సాధించింది. కరాటేలో భాగంగా ఉన్న ఉషు పోటీల్లో 52 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి (రజత), 65 కేజీల విభాగంలో ఎ.సత్యవైష్ణవి (కాంస్య) పతకాలు గెలుపొందారు. విజేతలను వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ పి.లక్ష్మణరావును కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం సహా పలువురు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


కొండెవరంలో కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

'ఉపాధి పనులను నాణ్యతగా చేయండి'

కొత్తపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను నాణ్యతగా చేసి వంద రోజుల పనిదినాలు పూర్తి చేయాలని ఉపాధి హామీ మండల అధికారులు విజ్ఞప్తి చేశారు. కొండెవరంలో ఉపాధి శ్రామికులు చేపట్టిన కాలువ పూడికతీత పనులను ఏపీవో గొన్నాబత్తుల కొండలరావు, ఎంపీడీవో లక్ష్మి గురువారం పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, గోకులం షెడ్ల నిర్మాణ పనులను కూడా వారు పరిశీలించారు.

నేటి నుంచి వాలీబాల్ ఎంపిక పోటీలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల వాలీబాల్ సెలక్షన్స్ కమ్ చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వాలీబాల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంఈవో-1 తుమ్మల సత్య రంగారావు తెలిపారు. ఏపీఎస్పీ హైస్కూల్లో మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పోటీల వివరాలను వెల్లడించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం.హరిబాబు ను 8331954206 నెంబరులో సంప్రదించాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, యోగా, చెస్ అథ్లెటిక్స్ పోటీలను ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడ రూరల్ ఏపీఎస్పీలో నిర్వహిస్తామన్నారు. 23న బాలికలకు, 24న బాలురకు పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రి, ఎంఈవో-2 శ్రీనివాస్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 రంగారావు

'సెజ్ భూములకు తిరిగి రైతుల పేరుతో ఉచిత రిజిస్ట్రేషన్ నిర్ణయం హర్షణీయం'

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్ కోసం సేకరించిన 10,500 ఎకరాల భూముల్లో ఇంతవరకు నష్టపరిహారం పొందని రెండువేల ఎకరాల రైతుల భూములను పూర్తి యాజమాన్య హక్కులతో తిరిగి వారి పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కో-ఆర్డినేటర్ తోటి చంగల్‌రావు హర్షం వ్యక్తం చేశారు. డీబీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొండంగి మండలంలో సెజ్ కోసం సేకరించిన భూములకు ఇప్పటి వరకు నష్టపరిహారం తీసుకోని దళిత రైతుల 250 ఎకరాల భూములను కూడా రిజిస్ట్రేషన్ చేసి వారికి అప్పగించాలన్నారు. జీవో నెం.12ని పూర్తిస్థాయిలో అమలు జరపాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ది ల్యాండ్ లైవ్లీహుడ్ లూజర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బూర్తి అప్పారావు, దళిత రైతులు బత్తుల లక్ష్మణరావు, నేపా నూకరాజు, అంగుళూర్ లక్ష్మణరావు, ఆకుమర్తి చిన్ని, పెదపూడి గౌరయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కో-ఆర్డినేటర్ చంగల్‌రావు

పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు చర్యలు

ఏపీఐఐసీ జోనల్ మేనేజరు అబ్బిరెడ్డి రమణారెడ్డి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఏపీఐఐసీ జోనల్ మేనేజరు అబ్బిరెడ్డి రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో శానిటేషన్ వర్కర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, సిల్టింగ్ తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విధిగా మొక్కలు పెంచాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ప్లాట్ల నిర్వాహకులు జడ్ఎం వద్ద ఏకరువు పెట్టారు. పన్నులు చెల్లిస్తున్నా పారిశుధ్య పనులు చేయట్లేదని, పూర్వం ఎప్పుడో నిర్మించిన డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడం, కొత్తగా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్లపై, ప్లాట్ల ముందు రోజుల తరబడి నిల్వ ఉండి పోవడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నామన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేకంగా టెండర్లు ఆహ్వానించామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని జడ్ఎం రమణారెడ్డి హామీనిచ్చారు. ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి’

తొండంగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం ఆయన పెరుమాళ్లపురంలో మాట్లాడారు. ఆయన వెంట వైసీపీ నేతలు యనమల కృష్ణుడు, బత్తు వీరబాబు, కొయ్యా మురళి, మడదా హేమంత్ తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నూతన జీఎస్టీ లాభాలపై అవగాహన ర్యాలీ



జీఎస్టీపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

రంపచోడవం, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీ విధానంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. గురువారం పెదగెద్దాడలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్, సీతపల్లి దేవస్థానం ఛైర్మన్ కుంజం బాపన్నదొర, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె డెబోరా సునీత, సిద్దా వెంకన్న, కాళ్ళకూరి సత్య సుందరరావు, సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, కూటమి నాయకులు కారం సింహాచలం, కారం అబ్బాయిదొర, శారపు జోగిదొర, అన్నిక అప్పారావు, కుంజం బాపన్నదొర, అడబాల బాపిరాజు, నెరం వీరాస్వామి, పండా చెల్లన్నదొర (బాబీ), రాగాల సురేష్, స్వప్న కుమారి, సత్యనారాయణమ్మ, శారపు పావని, బచ్చల రాజుబాబు, రాజశేఖరెడ్డి, పాపోలు శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కూటమి పార్టీల నాయకులు, అధికారులు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. రాజవొమ్మంగిలో ఎంపీడీవో యాద గిరేశ్వరరావు, జడ్డంగిలో టీడీపీ నాయకులు గణజాల తాతారావు జీఎస్టీ సంస్కరణలతో కలిగే ప్రయోజనాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

రాజవొమ్మంగి అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. రాజవొమ్మంగి పంచాయతీ కార్యాలయన్ని గురువారం డీపీవో ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం డీపీవో చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నడులేని విధంగా కూటమి ప్రభుత్వం కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తుందన్నారు. ఇప్పటికే పలువురికి పదోన్నతులు కల్పించారని, దీపావళి పండుగ నేపథ్యంలో మరికొంత మందికి పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసిందన్నారు

బాణసంచా విక్రయాలపై జాగ్రత్తలు పాటించాలి

మోతుగూడెం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):బాణసంచా వ్యాపారులు జాగ్రతలు పాటించాలని మోతుగూడెం ఇన్‌చార్జి ఎస్ఐ చరణ్ నాయక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దుకాణాల వద్ద సిగరెట్లు, బాణసంచా కాల్చవద్దన్నారు. నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణదారుడు విధిగా లైసెన్సులు పొందాలన్నారు

వాహనాల తనిఖీ

మోతుగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాహనాలకు సంబంధించిన దస్త్రాలు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని మోతుగూడెం ఇన్‌చార్జి ఎస్ఐ చరణ్ నాయక్ అన్నారు. చెక్‌పోస్ట్ వద్ద గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. పోలీసు సిబ్బంది మురళి, శ్రీను పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ఎటపాక, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం సాయం చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, టీడీపీ నాయకుడు నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. బుధవారం నెల్లిపాకలో అనారోగ్యానికి గురైన బోల నరసింహారావుకు సీఎం సహాయనిధి రూ.52,248 చెక్కును అందజేశారు. నాయకులు రెడ్డి రామకృష్ణ, జి.నరేష్, రవీంద్రనాథ్, సాయి పాల్గొన్నారు.

చెత్త సేకరణ తీరు పరిశీలన

అడ్డతీగల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్రంగి వీధిలోని చెత్తసేకరణను జిల్లా పంచాయతీ అధికారి కె.చంద్రశేఖర్ పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి చెత్త సేకరణ తీరును అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్ మిత్రలకు అందించాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతీ నెల ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయని, కాల్స్ వచ్చినప్పుడు తమ అభిప్రాయాన్ని తెలపాలన్నారు. అనంతరం కార్యదర్శులతో ఇంటి పన్నువసూళ్ళ, పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

వై.రామవరం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): యార్లగడ్డలో శ్రీవిద్య ఉపాసకులు, వారాహి పీఠాధిపతులు అరుణానంద స్వామీజీ ఆధ్వర్యంలో గురువారం 120మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. హిందూ నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట రామకృష్ణ, అల్లూరి జిల్లా వనవాసీ అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి సమక్షంలో మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పల్లాల పద్మావతి, ఎంపీటీసీ శుభ లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని క్రాంతి కుమార్, సూపర్‌వైజర్ సుందరి, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట స్త్రీశక్తిభవన కార్యాలయంలో గురువారంసీడీపీవో కె.ఉమా, ఎంపీడీవో ఎస్.సాల్మాన్‌రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, సొసైటీ ఛైర్మన్ మాగాపు బాబూరావు, వైద్యాధికారిణి కె.చైతన్య ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.అమ్మాజీ, వై.రామలక్ష్మి, పి.వెంకటలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది హెచ్‌వీ వసంత, ఎం.జోగమ్మ, ఏఎన్ఎం మంజుల, మంగ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై సమావేశం

దేవీపట్నం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పెద్దభీంపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ-3లో నిర్వాసితుల సమస్యలపై కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితుల నుంచి ఆంధ్ర ఉద్యమాల వేదిక కన్వీనర్ మహదేవన్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ, ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తాల్లూరు వీరభద్రారెడ్డి, బడిగుంట రాజారెడ్డి, నడిపూడి గాంధీ రెడ్డి పాల్గొన్నారు.

పురుగుమందుల షాప్ యాజమాన్యానికి నోటీసు

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోచవరం కాలనీలో ఉన్న జ్ఞాన శక్తి పురుగు మందుల షాపు యజమాని అధిక రేట్ల ఎరువులు అమ్ముతున్నారని ఆరోపణలు రావడంతో షాప్ యాజమాన్యానికి నోటీస్ జారీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సీహెచ్ దేవి తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీకి విక్రయించాలని, ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా రూ.370కి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు

కూనవరం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కూటూరు ఆసుపత్రి వైద్యులు ఇద్దరూ సమ్మెలో ఉండటంతో ఆసుపత్రిలో వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు మేకల నాగేశ్వరరావు అన్నారు. కూటూరు ఆసుపత్రిని సీపీఎం బృందం గురువారం పరిశీలించింది. ఈఆసుపత్రికి వైద్యుల కొరత తీర్చాలన్నారు.సీపీఎం మండల కార్యదర్శి బాబు, బాబు బోర్రయ్య పాయం సీతారామయ్య, సర్పంచ్ వెంకమ్మ తదితర పాల్గొన్నారు.

వెంకన్నదొర కుటుంబానికి పరామర్శ

దేవీపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దేవారం మాజీ సర్పంచ్ తుర్రం వెంకన్నదొర అనారోగ్యంతో మరణించారు. టీడీపీ నాయకులు మరిశెట్ల వెంకటేశ్వరరావు, ముండ్రు మధుసూదనరావు, జొన్నల రాంబాబు, ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు తదితరులు గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ఏలేశ్వరంలో జీఎస్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ



తునిలో పార్టీ శ్రేణులతో కలిసి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య



జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు

ఏలేశ్వరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో జీఎస్టీ రేట్లపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లతో గురువారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. మెయిన్ రోడ్డు నుంచి బాలాజీచౌక్ సెంటర్ వరకు ఎమ్మెల్యే స్కూటీ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కాకినాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగేంద్ర, పెద్దాపురం అసిస్టెంట్ కమిషనర్ పద్మావతి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పి. మోహన్, గట్టిం వెంకటరమణ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థికాభివృద్ధి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీలతో అన్ని వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తునిలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ విస్తృతస్థాయి అవగాహన కార్యక్రమం గురువారం తుని మున్సిపల్ కార్యాలయంలో జరగగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తుని మున్సిపల్ ఛైర్మన్ నార్ల భువన సుందరి, తుని మాజీ మున్సిపల్ ఛైర్మన్ యినిగంటి సత్యనారాయణ, టీడీపీ తుని పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, పార్టీ నాయకులు మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ వాహనాల ర్యాలీ

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో రవాణాశాఖ నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ మోటార్ సైకిల్, ఆటోలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కాకినాడ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభలో నవీన్ ప్రసంగిస్తూ ప్రజలందరికీ ఉపయోగపడేలా తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 వల్ల ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సరుకు రవాణాకు గతంలో 28శాతం జీఎస్టీ ఉంటే ఇప్పుడు 18 శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, ఎంపీపీ తోట రవి, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, మారిశెట్టి రాధా, పాలకుర్తి సురేష్, రేఖ బుల్లి రాజు, బోండా రాజేష్ పీలా మహేష్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు దుర్గారావు, రాజా, జగ్గంపేటలోగల ఐదు ఆటో యూనియన్ అధ్యక్షులు గుంపాన దొరబాబు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీతో రవాణా రంగానికి మేలు

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో రవాణా రంగంపై ఆధారపడిన కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. వాహనాలపై తగ్గిన జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ పలు వాహనాల డ్రైవర్లు, కొనుగోలుదారులకు తునిలో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మ్యాక్సీ క్యాబ్, ఆటోలతో తుని పట్టణంలోని ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్‌ను గొల్ల అప్పారావు సెంటర్ వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ధర్మారావు తదితరులు హాజరయ్యారు.



ధర్మవరంలో హరిశ్చంద్ర కళాప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

అలరించిన సత్యహరిశ్చంద్ర

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 89వ వార్షికోత్సవేత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర కళారూపకం అలరించింది. హరిశ్చంద్రుడిగా సింగిరెడ్డి రాంబాబు, వీరబాహుడిగా బలిజ వీర్రాజు, నక్షత్రకుడిగా మొరుకుర్తి పెంటయ్య, పోలిగా మంతెన శ్రీను నటించారు.



సానా సతీష్‌ను సన్మానిస్తున్న కన్నబాబు బృందం

సానా సతీష్‌ను కలిసిన ఖాదీ బోర్డు డైరెక్టర్ కన్నబాబు బృందం

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు బృందం ఎంపీ సానా సతీష్‌ను గురువారం కలిసి ఆయన్ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసింది. జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్‌ను కూడా వారు కలిశారు. మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, మూరా చిన బాబు తదితరులు ఉన్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే

ఏలేశ్వరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి ఉన్నా సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులతో అభినంద సభ నిర్వహించారు. శాలువాలు, మెమెంటోలతో వారిని అభినందించారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీతులసి, ఉపాధ్యాయులు చినబాబు పాల్గొన్నారు.

‘మామిడి, జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి’

ప్రత్తిపాడు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):మామిడి, జీడిమామిడిలో సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మండలంలోని పాండవులపాలెం, బవురువాకల్లో గురువారం రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ చల్లా మాట్లాడుతూ రాబోయే రెండునెలల్లో మామిడి,జీడిమామిడి, ఉద్యాన పంటల్లో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. మామిడి, జీడిమామిడితోటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సర్పంచ్ గుమ్మిడి అన్నవరం, గ్రామ ఉద్యానసహాయకులు గణేష్, బవురువాక ఉపసర్పంచ్ గెడ్డం వెంకటరమణ, ఉద్యాన సహాయకులు కె.బాలవీరాస్వామి పాల్గొన్నారు.

జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

గండేపల్లి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):కె.గోపాలపురం,ఉప్పలపాడు గ్రామాల్లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులపై మండల ఉద్యానఅధికారిణి ఎ.శ్రీవల్లి రైతులకు శిక్షణ ఇచ్చారు. క్రిషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల శాస్త్రవేత్త ఎన్వీ రఘునందన్ ముఖ్యఅతిథిగా హాజరై జీడిమామిడిలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, కత్తిరింపులు, సమగ్ర సస్యరక్షణ వంటి చర్యలపై వివరించారు. సర్పంచ్‌లు కర్రి రామాంజనేయులు, అడబాల అంజనేయులు, అవసరాల బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దీపావళి కానుక పంపిణీ

మోతుగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సొసైటీ (గాజువాక) గురువారం లాభాల్లో డివిడెంట్ గిఫ్ట్‌లను సొసైటీ కార్యదర్శి పి.వాసు, డైరెక్టర్ వై.సత్తిబాబు ఆధ్వర్యంలో దసరా, దీపావళి కానుకగా విశాఖపట్నం నుంచి వచ్చి సభ్యులకు మోతుగూడెం 1104యూనియన్ ఆఫీస్‌లో అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి కిరణ్, బ్రాంచ్ కార్యవర్గం శ్రీనివాస్, మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె. దొరబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హాస్టల్ వద్ద పరిశీలన చేస్తున్న ఎంపీడీవో, అధికారులు

హాస్టళ్లలో రికార్డుల పరిశీలన

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు హైస్కూల్ సమీపంలో సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహం వద్ద అపారిశుధ్యానికి కారణమవుతున్న మురికి కుంటను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, పంచాయతీ అధికారులను ఆదేశించారు. వసతిగృహాన్ని అధికారులతో కలిసి గురువారం ఎంపీడీవో సందర్శించి మురికి కుంట నిర్మూలనకు శాశ్వత పరిష్కారంగా మురికి నీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజును ఆదేశించారు. అనంతరం హాస్టల్‌లో సౌకర్యాలను ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. సమీపంలో వాటర్ ట్యాంక్ నుంచి నీరు లీకేజ్ నివారణకు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ ఎంఎన్ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు అందించారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఛైర్మన్ రమేష్ నాయుడుతో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను జ్యోతుల నెహ్రూ పరిశీలించారు . ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా శ్రీశైలం మల్లన్న సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌తో తంటికొండ దేవస్థానం పునర్నిర్మాణం గురించి చర్చించి అనంతరం నరేంద్ర మోదీ సభలో పాల్గొనేందుకు ఆయన కర్నూలు బయలుదేరి వెళ్లారు.

కర్నూలు సభలో నేతల సందడి

జగ్గంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు దగ్గర ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభలో నేతలు పాల్గొన్నారు. ఈ సభకు కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొని జాతీయ జెండాతో ప్రధాని మోదీకి మద్దతు తెలిపారు. బహిరంగ సభకు సుమారు మూడు లక్షల మంది హాజరు కాగా. ప్రధాని ఓపెన్ టాప్ వాహనంలో హెలిప్యాడ్ నుంచి బయలుదేరి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రాంగణానికి చేరుకున్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 450 ఎకరాల్లో ఏర్పాట్లు చేశారు. ఈ వేదిక నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పలు ప్రారంభోత్సవాలు, పలు శంకు స్థాపనలు చేశారు.

‘పురుగుల మందు వాడకాన్ని తగ్గించాలి’

శంఖవరం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బయోపెస్టిసైడ్లతో పంట నాణ్యత పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు బుల్లిబాబు అన్నారు. అరెంపూడిలో పొలం బండి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ప్రస్తుతం వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. బయోపెస్టిసైడ్లు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి నేల సారాన్ని మెరుగుపరిచి రసాయన పురుగులు మందుల వాడకాన్ని తగ్గిస్తాయన్నారు. వరి సాగులో ఎలుకలు కలిగించే నష్ట విధానం, సమగ్ర సస్యరక్షణ చర్యలు, ఎర్రమందు తయారీ విధానాన్ని వివరించారు. మండల వ్యవసాయాధికారి రైతులకు ఎల్ల మందు అందజేశారు. ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి



ఇర్లపల్లిలో విద్యార్థినులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం కె.ఎర్రంపాలెం, ఇర్లపల్లి ఆశ్రమ బాలికల పాఠశాలలను ఆమె పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలను అడిగితెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. హెచ్ఎం వై.లక్ష్మి, ఎస్.రాజేశ్వరి, వార్డెన్లు ఎ.నాగదుర్గదేవి, కె.రాజ్యలక్ష్మి, పీడీలు డి.సుగంధి, కె.రామాయమ్మ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

రంపచోడవరం,అక్టోబర్16(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం ‘సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా షోరూమ్ డీలర్లు మోటార్ సైకిళ్లు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. షోరూమ్‌డీలర్స్ యువత పాల్గొన్నారు.

వలస రైతులపై కేసులు నమోదు చేయాలి

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకుని లీజుకు ఇస్తున్న గిరిజనేతరులపై, లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న వలస రైతులపై ఎల్ఆర్ కేసులు నమోదు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. గురవారం వారు తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కూడా వినతిపత్రం అందజేశామన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

కోటనందూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ సీనియర్‌నేత గాడి రాజుబాబు అన్నారు. కోటనందూరులో గురువారం ఆటో యాజమాన్యం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, దంతులూరి చిరంజీవిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు, వెలగా వెంకటకృష్ణారావు, చింతకాయల రవికుమార్, షేక్‌నవాబ్‌జానీ, చిటికెల సత్యనారాయణ, సామినీడు కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్య ప్రొఫెసర్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆదిత్య ప్రొఫెసర్‌కు పురస్కారం

గండేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పాలేపు నారాయణరావు ప్రతిష్ఠాత్మకమైన సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ (సోనెట్) వారి ఇంటర్నేషనల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ బోధకుల పురస్కారం-2025ను అందుకున్నారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పురస్కారం సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ (సొలెట్) ఆధ్వర్యంలో విజయవాడలో ప్రదానం చేసినట్టు తెలిపారు. పురస్కారం అందుకున్న నారాయణరావును ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేష్, డాక్టర్ ఆర్‌వీవీ కృష్ణ అభినందించారు.



ఎస్.అన్నవరం పరిధిలో రోడ్డుపక్కన జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

తుని రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎంపీడీవో సాయి నవీన్ తెలిపారు. ఎమ్మెల్యే సూచనలకు అనుగుణంగా మండల పరిషత్ సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలపై దృష్టి సారించామని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్.అన్నవరం పరిధిలోని ప్రధాన రోడ్డును రైల్వే గేటు నుంచి తుని ప్రారంభం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రత్తిపాడులో వైసీపీ నిరసన

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై గురువారం ప్రత్తిపాడులో వైసీపీ నిరసన, ఆందోళన చేపట్టింది. నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు, నాయకులతో ఎక్సైజ్ స్టేషన్ వద్ద ధర్నా జరిపారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ముద్రగడ గిరిబాబు, నర్సాపురం, కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, దాట్ల సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మి శివకుమారి మాట్లాడారు. అనంతరం ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్‌కు వారు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ: ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో గురువారం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నేతృత్వంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ చేయడంపై వారు నిరసన వ్యక్తం చేశారు.

ఆలయానికి సిమెంట్ బస్తాల విరాళం

జగ్గంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఉన్న పురాతనమైన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పునర్నిర్మాణానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్య క్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు 50 బస్తాలు సిమెంట్‌ను విరాళంగా ప్రకటించారు. వాటిని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.